విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



చెస్ టోర్నమెంట్ విజేత జరీర్ అహ్మద్‌ఖాన్‌కు మెమొంటో అందజేస్తున్న నిర్వాహకులు

చార్మినార్: అఖిల భారత జవహర్ లాల్ నెహ్రూ అండర్-16 చెస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన జరీర్ అహ్మద్ ఖాన్ విజేతగా నిలిచారు. 8 రౌండ్లలో 7, 5 పాయింట్స్ సాధించి ఆల్ ఇండియా జవహర్‌లాల్ నెహ్రూ చెస్ టోర్నమెంట్ చాంపియన్‌గా నిలిచాడు. ఇక టోర్నమెంట్‌లో 7 పాయింట్స్ సాధించిన శ్వేతార్క్ శ్రేయాస్ మలానీ ద్వితీయ స్థానంలో నిలిచారు. పాతబస్తీ మొగల్‌పురాలోని ఉర్దూఘర్‌లో ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పోటాపోటీగా జరిగిన చెస్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన విజేతలకు శనివారం బహుమతుల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ రియాజ్ పాషా, కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. చెస్ క్రీడల్లో విద్యార్థులు రాణించే విధంగా తమ సొసైటీ కృషి చేస్తుందన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి


పీస్ కమిటీ సభ్యులతో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ సైదులు తదితరులు

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఆయన పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు, దర్గాలు, ఆలయాల నిర్వాహకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు, ప్రజల మధ్య సత్సంబంధాల కోసం నగర కమిషనర్ పీస్ లవర్స్ అనే యాప్‌ను ప్రారంభించారన్నారు. శాంతిభద్రతలు కాపాడడం, స్థానికుల మధ్య సత్సంబంధాలను ప్రతిష్టం చేయడం ఈ యాప్ లక్ష్యమన్నారు. గోల్కొండ లాంటి ప్రశాంతమైన ప్రదేశంలో పని చేయడం తమ అదృష్టమని నగరంలో జరిగే అతిపెద్ద పండుగలు, జాతీయ పండుగలు గోల్కొండలోనే జరుగుతాయన్నారు. మసీదులు, దర్గాలు, ఆలయాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏసీపీ అశోకచక్రవర్తి, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, పీస్ కమిటీ ప్రతినిధులు ఆబీద్, ఇలియాస్ అలీ, ఎస్.రాజువప్రసాద్, ఏ.పరమానందం తదితరులున్నారు.

మేరు కులస్తులకు చట్టసభల్లో ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న ఆదిమూలం శంకర్, పోల్కం యాదగిరి

అబిడ్స్: మేరు కులస్తులకు చట్టసభల్లో సరైన ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర మేరు యువజన సంఘం సీనియర్ నాయకులు ఆదిమూలం శంకర్, పోల్కం యాదగిరి పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబమైన, మేరు కులస్తుల సీనియర్ నాయకుడు పోల్కం శ్రీనివాస్‌కు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని వారన్నారు. దాదాపు 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ గల నాయకుడిగా కొనసాగుతున్న పోల్కం శ్రీనివాస్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..ఆర్థికంగా, సామాజికంగా ఎంతో వెనుకబడిన మేరు కులస్తులకు తగిన ప్రోత్సాహం కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వెన్ను శివకుమార్, పల్లాల నవీన్, విక్రమ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట


దెక్కన్ పార్కులో నిర్వహించిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ప్రాజెక్ట్ హెడ్ మనోజ్ అగర్వాల్ తదితరులు

గోల్కొండ: పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ చెత్తాచెదారాలను తొలగింపు పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని ఆర్‌ఈ సస్టేనిబులిటీ హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌ డబ్ల్యూ లిమిటెడ్ ప్రాజెక్ట్ హెడ్ మనోజ్ అగర్వాల్ అన్నారు. సంస్థ 30 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం సెవన్ టూంబ్స్‌లోని దెక్కన్ పార్కులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, వ్యర్థాలను తొలగించి పార్కును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మనోజ్ అగర్వాల్ మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ చెత్తాచెదారాల తొలగింపు పనులను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. టిప్పర్లల్లోని డ్రైవర్స్, హెల్పర్స్‌కు సేఫ్టీ పరికరాలను ప్రతి వారం అందిస్తున్నామన్నారు. మాస్క్, గ్లౌజ్, షూ తదితర వాటిని ధరించి హెల్పర్స్ పనులను చేస్తున్నారన్నారు. వారికి తగిన గైడెన్స్ ఇస్తూ సమస్యలు లేకుండా చెత్త తొలగింపు పనులు జరుగుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ అభయ్ నిరంజన్, జోనల్ హెడ్స్ ప్రశాంత్‌మిశ్ర, గోవర్ధన్, రాజ్‌కరణ్, సర్కిల్ హెడ్స్, వార్డ్ ఫీల్డ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ బాధితులకు అండగా ఉంటాం


బాపూఘాట్ మూసీ నది వద్ద బీజేపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు తదితరులు

లంగర్‌హౌస్: మూసీ బాధితులకు అండగా ఉంటామని ఉమ్మడి వరంగల్ జిల్లా బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు అన్నారు. శనివారం రాత్రి ఆయన మూసీ బాధితులకు అండగా బీజేపీ తలపెట్టిన మూసీ వద్ద బస కార్యక్రమంలో భాగంగా లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద గల మూసీ నది ఒడ్డున బస చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరిట వారి ఇళ్లు కూల్చి నిరాశ్రేయులను చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా తాము మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న పేదల ఇళ్లు కూల్చడాన్ని అడ్డుకుంటామన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఇంద్రసేనారెడ్డి తదితరులున్నారు.

మేకలమండి.. కబ్జాలతో నిండి!


జియాగూడ మేకల మండి

జియాగూడ: జియాగూడ మేకల మండి స్థలాలను ఆన్‌లైన్ ద్వారా ట్రేడ్ లైసెన్స్ పొంది కబ్జా చేసి మరీ అద్దెలకు ఇచ్చుకుంటున్నారు కొందరు. జియాగూడ మేకల మండికి అనుమతి లేదు అంటూనే లైవ్ జీవాలు, వాహనాల పార్కింగ్ డబ్బులను మాత్రం జీహెచ్‌ఎంసీ వసూలు చేస్తున్నా.. కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. సుమారు 11 నుంచి 14 ఎకరాల్లో లో ఉన్న జియాగూడ మేకల మండి స్థలంలో 40 ఏళ్ల నుంచి కొంత మంది మాత్రమే మొండేదార్ (హోల్‌సేలర్)గా అనుమతులు పొంది ఉన్నారు. ప్రస్తుతం మేలకమండిలో జీవాలను అమ్ముకోవడానికి అనుమతి కోసం ట్రేడ్ లైసెన్స్‌ను ఆన్‌లైన్ ద్వారా పొంది మండిలోని ఖాళీ స్థలాలను కొంత మంది ఆక్రమించుకుని షెడ్లు వేసి కొద్ది రోజులు వ్యాపారం నిర్వహించి తమ షెడ్లను సుమారు రూ.10 నుంచి రూ.20 వేలకు అద్దెలకు ఇస్తూ దండిగా లాభ పడుతున్నారు. జియాగూడ స్లాటర్‌హౌస్‌లో నీటి వసతి కోసం నిర్మించిన బావిని సైతం మూసేసి దానిపై ఓ నాలుగు షెడ్లు వేసి అద్దెలు వసూలు చేస్తున్నారు. పలు పార్టీల వారు తాము మండికి అండగా ఉంటున్నామంటూ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మండిలో సమస్యలు..

జియాగూడ మేకలమండి వివిధ సమస్యలతో కొట్టుమిట్టులాడుతోంది. ముఖ్యంగా మండిలో రోడ్లు లేకపోవడంతో దుమ్ము, ధూళి, అపరిశుభ్రత, వర్షం పడితే బురదమయం, భారీ వాహనాల పార్కింగ్ తదితర ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మహా అన్నకూట్ మహోత్సవాలు


పూజల్లో డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి దంపతులు


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దిడిగే జయంత్ తదితరులు


మీరాలంమండిలో గోవర్ధనగిరి పూజలు

చార్మినార్: మీరాలంమండిలో మహా అన్నకూట్ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శనివారం తెల్లవారు జాము వరకు జరిగిన ఈ వేడుకల్లో పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సుల్తాన్‌షాహి జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి, ప్రముఖ వ్యాపారి దిడిగే జయంత్, టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి, సురేష్, ప్యారసాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. వీరికి ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ పూజల్లో పాతబస్తీకి చెందిన భక్తులే కాకుండా నగరంలోని ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాజుల అంజయ్య మాట్లాడుతూ.. మహా అన్నకూట్ మహోత్సవాలలో పాల్గొన్న భక్తులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

రంగనాథ ఆలయంలో..

జియాగూడ: జియాగూడ రంగనాథ ఆలయంలో అంకుట్ పూజలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఆలయ ప్రతినిధి శేషాచార్యులు ఆధ్వర్యంలో తులసి కల్యాణం, అంకుట్ అన్నప్రసాదం జరిగాయి. బద్రీనాథ చార్యులు తదితరులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


జియాగూడ రంగనాథ ఆలయంలో..


తులసీ కల్యాణం చేస్తున్న అర్చకులు


మీరాలంమండిలో మహా అన్నకూట్‌లో భక్తులు

బాధ్యతల స్వీకరణ



అఫ్జల్‌గంజ్: శాంతి భద్రతల పరిరక్షణకు పౌరులంతా భాగస్వాములవ్వాలని అఫ్జల్‌గంజ్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నూనావత్ రవి నాయక్ అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా స్నేహపూర్వకమైన వాతావరణంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

'కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దివాలా'


దేవర శ్రీనివాస్

గోల్కొండ: కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. రైతుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మరచిందన్నారు. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడం మరచి సీఎం రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ పనులను చేపట్టడం వెనుక మతలబు ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఓవైపు హైడ్రా, మరో వైపు మూసీ ప్రక్షాళనతో కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు.

నిషిక అగర్వాల్‌కు కాంస్య పతకం


కోచ్ రానాతో నిషిక అగర్వాల్

గన్‌ఫౌండ్రీ: జిమ్నీస్ జిమ్నోవా కప్ ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్ పోటీలలో నగరానికి చెందిన క్రీడాకారిణి నిషిక అగర్వాల్ అద్భుత ప్రతిభను కనబరిచింది. ఈ పోటీలలో కాంస్య పతకాన్ని సాధించి తన ప్రతిభను చాటుకుంది. ఈ సందర్భంగా కోచ్ మనోజ్‌రానా మాట్లాడుతూ.. ఖేలో ఇండియా అథ్లెట్‌గా ఈ ఘనతను సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

నకిలీ వైర్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ కంపెనీలకు చెందిన పేర్లతో నకిలీ వైర్లు విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసిన ఘటన అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అబిడ్స్‌లోని రామకృష్ణ థియేటర్ వద్ద రాజస్తాన్‌కు చెందిన శంభుసింగ్ (30) ద్విచక్ర వాహనంపై వివిధ కంపెనీలకు చెందిన నకిలీ వైర్లను విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులు దాడులు నిర్వహించి శంభుసింగ్ వద్ద నుంచి సుమారు రూ.15 లక్షల విలువ చేసే 100కు పైగా వైర్ల బెండల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తుకు నిందితుడిని అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఒంటరి మహిళలకు చేయూత అభినందనీయం


అనాథ చిన్నారులకు చెక్కులు అందజేస్తున్న జీవన్‌లాల్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఒంటరి మహిళలకు చేయూతనిచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లవిదియ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో ఆర్‌జే ఇన్‌స్పిరేషన్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో పలువురు ఒంటరి మహిళలకు, అనాథ పిల్లలకు నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఎంతో మంది అనాథ చిన్నారులు దాతల సహాయ సహకారాలతో ఉన్నత స్థానానికి ఎదిగారని గుర్తు చేశారు. ఒంటరి మహిళలు, అనాథ చిన్నారుల గురించి సంస్థ చేస్తున్న పనులను కొనియాడారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీనటుడు వనపర్తి నరేస్, మాజీ కార్పొరేటర్ కె.రామారావు, సంస్థ వ్యవస్థాపకురాలు ఉమాకాంతి తదితరులు పాల్గొన్నారు.

జాంబాగ్, గన్‌ఫౌండ్రీ డివిజన్లలోని సమస్యలు పరిష్కరించాలి



సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గంలోని జాంబాగ్, గన్‌ఫౌండ్రీ డివిజన్లలో సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా స్థానిక కార్పొరేటర్లు, అధికారులు పట్టించుకోవడం లేదని గోషామహల్ బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. శనివారం గౌలిగూడలోని కొత్తబస్తీలో కొన్ని రోజులుగా రోడ్లు గుంతలు పడడం, కచ్చిమోరీ, మ్యాన్‌హోల్స్ పగిలిపోయాయని ఈ సమస్యలపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె సంబంధిత అధికారులను పంపారు. ఆయా ప్రాంతాల్లో ఆనంద్‌గౌడ్, ఇతర అధికారులు పాదయాత్ర చేసి ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో తెలుసుకున్నారు. రెండు రోజుల్లో ఆయా పనులు చేయిస్తామని ఇంజినీరింగ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జాంబాగ్, గన్‌ఫౌండ్రీ డివిజన్లలో పారిశుద్ధ్యం పనులు జరగకపోవడంతో వీధులన్నీ మురికి కుప్పలుగా మారాయన్నారు. సంబంధిత జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్‌ఓ శానటరీ సూపర్‌వైజర్లు పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, జ్ఞానేశ్వర్, నరేష్‌గౌడ్, విజయ్ ముదిరాజ్, మహేష్, రాకేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారికి చక్రస్నానాలు



లంగర్‌హౌస్: కార్తీక పౌర్ణమి ముక్తిస్నానాల జాతరలో శనివారం సీతారామ లక్ష్మణులకు వైభవంగా చక్రస్నానాలు నిర్వహించారు. పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో పండితులు శ్రీనివాస రమణ చేతుల మీదుగా త్రివేణి సంగంలో ఈ వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా ఉత్సవ మూర్తులకు సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు, అమ్మవారికి చక్రస్నానాలు నిర్వహించి రాహుల్‌దాస్ బాబాతో పాటు భక్తులు చక్రస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం జరిగింది.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

బహదూర్‌పురా: అర్ధరాత్రి ఇంట్లో చొరబడి బీరువాలోని బంగారు నగలను దోచుకెళ్లిన ఓ నిందితుడిని కాలాపత్తర్ పోలీసులు అదుపులోకి తీసుకొని చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం..చందులాల్ బారాదరి ఉమర్ సూపర్ మార్కెట్ పక్కన పర్వీన్ బేగం నివాసముంటుంది. ఈ నెల 13న అర్ధరాత్రి పర్వీన్ బేగం పిల్లలతో కలిసి ఓ గదిలో నిద్రపోగా ఆమె తల్లి గౌసియా బేగం మరో గదిలో నిద్రపోయారు. అర్ధరాత్రి 3 గంటల సమయంలో ఆమె సోదరుడు ఇంటికి రాగా బీరువాలు తెరిచి ఉన్నాయి. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటంతో దొంగతనం జరిగిందని గ్రహించి కాలాపత్తర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్ నేతృత్వంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు కాలాపత్తర్ పోలీసులు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు తాడ్‌బన్ చౌరస్తాలో సంచరిస్తున్న బండ్లగూడ గౌస్‌నగర్‌కు చెందిన తాహేర్ కుమారుడు మహ్మద్ నూరుల్లా హుస్సేన్ (25)ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. దొంగలించిన ఆరు తులాల బంగారు నగలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. 8 గంటల్లోనే చోరీ కేసును చేధించి నిందితుడిని పట్టుకున్న కాలాపత్తర్ పోలీసులను దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, ఫలక్‌నుమా ఏసీపీ జావీద్‌లు అభినందించారు.

వైభవంగా కార్తీక పూజలు


పూజల్లో గిరిధర్, విక్రమ్ ముదిరాజ్, హన్మంత్‌రెడ్డి తదితరులు

అబిడ్స్: కార్తీక మాసం పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర ఆలయంలో శనివారం భక్తులు పెద్ద ఎత్తున దీపాలంకరణ చేసి పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు గిరిధర్, ఇతర నాయకులు విక్రమ్ ముదిరాజ్, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహేష్ దంపతులు విగ్రహాలతో ప్రదర్శన చేసి కార్తీకమాసం పూజలు నిర్వహించారు.

గ్రంథాలయంలో అరుదైన పుస్తకాల ప్రదర్శన


పుస్తకాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న పూర్వ ఉద్యోగులు

అఫ్జల్‌గంజ్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో అరుదైన, అపురూప పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పూర్వ గ్రంథాలయ ఉద్యోగులు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు.

పాతబస్తీలో బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలి


కేసీఆర్‌ను కలిసిన పంకజ్ షిండే

గౌలిపురా: బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావును పాతబస్తీకి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు, ఓంకార్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పంకజ్ షిండే శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను పంకజ్ షిండే కలిసి గురు పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి ఆయన ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ..పాతబస్తీలో బీఆర్‌ఎస్ పటిష్టతకు కృషి చేయాలని పంకజ్ షిండేకు సూచించారు.

దీపోత్సవ వేడుకలు



గోల్కొండ: కార్వాన్ రాంసింగ్‌పురాలోని మహంకాళీ ఆలయంలో శనివారం దీపోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్థానిక భక్తులతో పాటు బీజేపీ నాయకులు నామ యాదగిరి నేత, జొన్న కుంటి మధుసుదన్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం


ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌ను సన్మానిస్తున్న శివాజీ కురుమ


గన్‌ఫౌండ్రీ: కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. శనివారం హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తనకాల శివాజీ కురుమ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కురుమ గొంగడితో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్‌కురుమ పాల్గొన్నారు.

సన్మానం


స్పెషల్ కమిషనర్ నిఖిల్ చక్రవర్తికి మొక్కను అందజేస్తున్న మహ్మద్ రహమత్ అలీ తదితరులు

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖ స్పెషల్ కమిషనర్‌గా నియమితులైన నిఖిల్ చక్రవర్తిని వాణిజ్య పన్నుల శాఖ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ రహమత్‌అలీ, ఇతర నాయకులు ఘనంగా సన్మానించారు. మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రహమత్ అలీ మాట్లాడుతూ..ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలన్నారు. జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్పెషల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. అంచెలంచెలుగా సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

శాస్త్రీయ కళలను కాపాడుకుందాం


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ సంగీత నృత్య కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ రియలెస్టేట్ రెగ్యులరేటరి అథారిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో కళాకుటీర్ సొసైటీ ఫర్ ఫర్ఫామింగ్ ఫైనార్ట్స్ 10వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కథక్, వీణా వాహిద్యం తబల వంటి సంగీత గాత్ర కచేరీలు ఆహుతులను అలరించాయి. హిందుస్తాని కర్ణాటక కళల కోసం సంస్థ చేస్తున్న కృషిని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, హోమియోపతి వైద్యురాలు డాక్టర్ సుధారాణి, సంస్థ సభ్యులు అభినవ్ భట్టాచార్య, రూపా భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.